


# భిక్ష

## విజయసర్వలక్ష్మి




శాస్త్రికి దానధర్మాలంటే సదభిప్రాయం లేదు. కారణం ఇదీ అని చెప్పలేం. అతను ఆగర్భ శ్రీమంతుడు, వడ్డించిన విస్తరిలాంటి జీవితం. బహుశః అతనికి ఒక వస్తువుయొక్క లోటూ, దానిని పొందలేక పోవడం లాంటి అనుభవం లేకపోవడం కారణం అయి వుండవచ్చు.

లేక ఏదో నిర్వచించలేని, సహేతుకమైన వాదం అతనిలో నిగూఢంగా వుండి వుండడం అయి వుండవచ్చు. ఎప్పుడూ— ''మనం కష్టపడి సంపాదించి మళ్ళీ దేవుడిచ్చాడు అనడం ఎందుకూ?'' అంటూ వాదిస్తూ వుండేవాడు.

డబ్బు విషయమే కాదు అన్ని విషయాలలోనూ అలాగే వాదిస్తూ వుండేవాడు. ఇంతకీ అతనికి దేవుడేదో కాపాడతాడనీ, దానధర్మాలు మనిషిని ఇహలోకంలోనూ, పరలోకంలోనూ రక్షిస్తాయనీ ఏమాత్రం నమ్మకం లేదు.




ఇటీవల సాంస్కృతి సమాఖ్య నిజామాబాద్ జిల్లా శాఖ నిర్వహించిన సభలో ప్రొఫెసర్ జి.ఎ.సుబ్రహ్మణ్యం గారిని సమాఖ్య తరఫున సన్మానిస్తున్న జిల్లా జడ్జి బి.నారాయణరెడ్డి, డాక్టర్ జలపతిరావు, సమాఖ్య కార్యదర్శి శిరీష చిత్రంలో వున్నారు

అలాంటి శాస్త్రికి మంచి ఆచారమంతుల ఆడపడుచూ, విద్యాధికురాలూ అయిన అమ్మాయితో వివాహం అయ్యింది. ఆమె ప్రభావం అతనిమీదేమీ పడిపోలేదు. ఆమె అలవాట్లుఅతనికేమీ ఇబ్బందీకలిగించ లేదు. కాని, అనుకోని పరిణామం ఏదో తనలో చోటు చేసుకుంటూన్నట్టు మాత్రం గమనించాడు. అతను ప్రతీ శనివారం క్రమం తప్పకుండా, భార్యను దగ్గరలోనే ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి గుడికి తీసుకువెళ్ళడం మాత్రం అనుకోకుండానే జరిగిపోతూండడం గమనించి తనలో తనే ఆశ్చర్యపోయేవాడు.

శాస్త్రి భార్య పేరు భవాని. ఆమె దేవాలయానికి వచ్చేటప్పుడు చేసుకునే సాంప్రదాయకమైన అలంకరణలో ఏదో చెప్పలేని ఆకర్షణ, హృదయాన్ని పవిత్రం చేయగల భావాల స్పందన, ప్రతీవారం ఆమె కొత్తగా, స్వచ్ఛంగా, మనోహరంగా కనిపించేటట్లు చేస్తూండేది. గుడిలో అతనిపట్ల ఆమె ప్రవర్తన కూడా ఎంతో సరళంగా, మృదువుగా ఏమాత్రం నిర్బంధించనివిధంగా వుండేది. అయితే ఒక విషయం మాత్రం అతనికి ఆట్టే నచ్చేది కాదు. అయినా పైకి కనిపించేవాడు కాదు. ఇష్టాన్ని కాని, అయిష్టాన్ని కాని ఏమాత్రం కనిపించనివ్వకుండా, ఆమె మనసు నొప్పించకుండా జాగ్రత్త పడేవాడు.

అదే! ఆమెకు బీదవాళ్ళన్నా, ముష్టివాళ్ళన్నా చాలా జాలి. గుడి దగ్గర బారులు తీరి, తీరికగా ముష్టెత్తుకునే దౌర్భాగ్యులంటే ఆమెకు ఏదో చెప్పలేని జాలి. తరతరాలుగా ఆమెలో నెలకొన్న ఉత్తమ సంస్కారం వల్లనో, లేక సహజంగా ఆమె హృదయం దయాపూరితం అవడం వల్లనో తెలియదు. పుణ్యార్జన అన్న భావం వల్లనే అని కూడా గట్టిగా చెప్పలేం. మొత్తంమీద కాసిన్ని డబ్బులు మూటకట్టి తెస్తుంది. అవి అయిపోయేదాకా అక్కడ వున్న బిచ్చగాళ్ళందరికీ పంచిపెడుతుంది. పక్కనే బాడీగార్డులా, ఆ కార్యక్రమం అంతా అయ్యేదాకా, ఓర్పుగా ఆమె కూడా నడుస్తాడు. ఆమె కారు దగ్గరకు రాగానే ఏదో బరువు దిగిపోయినట్లు హుషారుగా కారు తలుపు తీసి పట్టుకుంటాడు శాస్త్రి. ఆ సున్నితమైన ఆ కాస్త తిరస్కారాన్ని కూడా కనపడకుండా జాగ్రత్తపడాలని చాలా ప్రయత్నించాడు కాని, లాభం లేకపోయింది.అంత రహస్యమైన అయిష్టత కూడా భవాని కళ్ళపడుతూనే వుండేది. కాని ఆమె ఏమీ బాధపడేది కాదు. అంతలో అంత ఏదో తానే గుడికి తీసుకువస్తున్నాడు. ఏ డ్రైవర్నో ఇచ్చి పంపించక— అదే చాలులే అనుకునేది. ఇంటికి వెళ్ళిపోయేక ఎప్పుడైనా దానధర్మాలమీద చర్చ వస్తే తన కాట్టే నమ్మకం లేదని ధైర్యంగా అనేస్తూ వుండేవాడు శాస్త్రి. భవాని అతని వాదనను ఎప్పుడూ ఖండించేది కాదు. వినీవిననట్లు ఊరుకునేది, మనసులో చాలా బాధపడుతూ వుండేది, మథనపడుతూ వుండేది. భర్త అలా దైవ దూషణం చేయడం వల్లనో ఏమో పెళ్ళయి ఆరేళ్ళయినా ఒక్క నలుసు కలగకపోవడం అనుకునేది. సాటి వాళ్ళలో చిన్నతనం తప్పడం లేదు. అత్తవారి ఊరు వెళ్ళినప్పుడల్లా "ఏమ్మా? మా ముచ్చట తీరేదెప్పుడు?" అంటూ అత్తగారు అడగడం, "మా అబ్బాయి పెద్దవాడయిపోతున్నాడమ్మా వదినా! ఎప్పుడూ మాకు కోడలు పుట్టడం?" అంటూ ఆడపడుచు ఆరా తీస్తుండడం— ఏంచేయాలో తోచక హాలాహలాన్నిరహస్యంగా మింగుతూ చిరునవ్వుతో నిలబడిపోవడం, ఎంత మరచిపోవాలన్నా మరపురాని బాధలైపోయాయి. కొంచెం తీరిక దొరికితే చాలు ఈ ఆలోచనలే చుట్టుముడుతుంటాయి.

డాక్టర్లను సంప్రదించడం అయ్యింది.. "ఏం దోషం లేదు, పుడతారు" అని వాళ్ళు హామీ ఇవ్వడం జరిగింది. శాస్త్రి మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు నిశ్చింతగా వుంటాడేగాని, పిల్లలు పుట్టలేదని ఏ ఒక్కనాడూ బాధపడడు.

ఆవాళ శ్రావణ శుక్రవారం. భవాని పూజా పునస్కారాలుపూర్తిచేసుకుని కాఫీ తాగుతూంది. ఆమెకు ఎంతో ఇష్టమైన పాట— "బండరాళ్ళను కడుగు పన్నీటి కన్న కరుణతో స్రవియించు కన్నీరు మిన్న" అంటూ టేప్ రికార్డరు వినిపిస్తూంది. ఆమె పరధ్యానంగా, ఏదో ఆలోచిస్తూ కూర్చుంది. శాస్త్రి అప్పటికి ఐదు నిముషాల నుంచీ ఆమె ధ్యానం భంగంచేయకుండా అలాగే నిలబడి వున్నాడు. ఆఖరుకి "భవానీ" అని పిలిచాడు. భవాని కంగారుగా భర్త వైపు చూచింది. "అరె! మీరు వచ్చి ఎంతసేపైంది? మీ కోసమే చూస్తు న్నాను. స్నానం చేయండి. కాఫీ తీసుకుందురు గాని" అంది.

"అలాగే కాని, ఈ వాళ ఓ డ్యూటీ పడిందోయ్! సాయంత్రం మనం ఒకరింట్లో పార్టీకి వెళ్ళాలి. మా కొలీగ్‌కు కొడుకు పుట్టేడు. ఈవాళ ఆ పిల్లాడ్ని ఉయ్యాల్లో వేస్తున్నారు. చాలా పెద్ద హడావిడి. పేరంటం, పార్టీ, ఫోటోలు ఓహ్! చాలా కంగారు చేస్తున్నాడులే. అంచేత నేను చెప్పేదేమిటంటే— సాయంత్రం ఆరయ్యే సరికి అమ్మగారు సర్వాలంకారభూషితులై, పట్టు వస్త్రాలను ధరించి సిద్ధంగా వుండగలరని మరీ మరీ ఆశిస్తూ న్నాము" అంటూ నాటకీయంగా అనేసరికి భవానీకి నవ్వొచ్చింది. శాస్త్రి కూడా "నేను నాటకాల్లోకి పనికొస్తానా?" అంటూ నవ్వేశాడు.

"అలాగే! ముందు మీరు స్నానం చేయండి. నెమ్మదిగా అన్నీ మాట్లాడుకోవచ్చు. ఇక లేవండి" అంది.

సాయంత్రం ఆరూ ఆరున్నర అవుతుంది. ఆదర్శ నగర్‌లో "అపరంజి నికుంజం"లో మహా ఆడంబరంగా

రావినూతల సువర్ణాకన్నన్ * నవల గాలిగోపురం * త్వరలో ప్రారంభం



# అమర్ ఖయ్యామ్

అంబుధు లీదవచ్చు, ప్రళయాగ్నుల గుప్పిట బట్టవచ్చు; గ్రం
థంబులు వ్రాయవచ్చు; గగనానికి నిచ్చెన వేయవచ్చు; వి
శ్వంబు జయింపవచ్చు; హిమశైలము నెక్కగవచ్చుగాక; చో
ద్యంబగు చావుపుట్టుకల దైవ రహస్య మెరుంగవచ్చునే!

శిష్టుల శీర్షమందు తమ చెప్పులపాదము లుంచి, భ్రష్టులౌ
దుష్టుల నెత్తికెత్తుకొను ధూర్తజగ మ్మిది; దీని పంచలో
కష్టము తృప్తిగా బ్రతుకగల్గుట; కల్గినదాని తోడ సం
తుష్టి వహింపుమా! పరుల దూషణభూషణముల్ సహింపుమా!

తెగడగ రాలవర్షము; నదే పొగడంగ వరాల వర్షమున్
జగ మిది నీ శిరమ్ము పయినన్ గురిపించును సుమ్ము; మిత్రులన్
దేగడిన శత్రులౌదురు; స్తుతించిన శత్రులు మిత్రులౌదు; రీ
ప్రగతి గ్రహింపరా! మధురభాషణమే మణిభూషణంబురా!

నీవు భుజింపుమా కడుపు నిండ! క్షుధార్తుల కింత పెట్టుమా!
నీవు సుఖింపుమా! పరుల నీవలెనే మననీయుమా! మరే
త్రోవల కడ్డురాకు! పెడత్రోవల కాలిడబోకు! మిద్దియే
జీవితమన్న! పంకిలము సేయకు స్వామి వరప్రసాదమున్!

**డాక్టర్ కరుణశ్రీ "అమర్ ఖయ్యామ్" పద్యకావ్యం నుంచి**

ఏర్పాటుచేసిన పేరంటం కం పార్టీకి ఖచ్చితంగా సమయానికి చేరుకున్నారు శాస్త్రి, భవానీలు.

షామియానాలో ఒక ప్రక్కన పూలతో అలంకరించిన కొత్త ఉయ్యాల మంచం, దాని పక్కగా వరసలుగా తీర్చి వేసిన కుర్చీలు, ఖరీదైన పేరంటాళ్ళు సన్నగా వినిపిస్తున్న జోలపాటలూ— ఎంతో కన్నుల పండువగా, భూలోక స్వర్గంలా ఒక్క క్షణం అక్కడ నిలబడ్డా చాలు ననిపిస్తూంది.

శాస్త్రి కొలీగ్, ఆయన భార్య హడావిడిపడిపోతూ అందరినీ ఆహ్వానిస్తూ "రండి రండి! ఇంతాలశ్యం చేశారేమిటి" అనీ, మీరింకా రాలేదని మీ అల్లుడు మారాం చేస్తున్నాడనీ" ఏదో ఒకటి సర్దాగా అంటూ ఆప్యాయంగా మాట్లాడుతూ గుమ్మం దగ్గర నిలబడ్డారు.

శుభ ముహూర్తం సమీపించింది.రావలసిన వాళ్ళంతా రాగానే చిన్నారి బాబుని ఉయ్యాలలో వేసి మురిసిపోయింది కన్నతల్లి. అంతా జోలపాటలు పాడి అక్షింతలు వేశారు. కానుకలు ఇచ్చారు. బంగారపు ఉంగరం బాబు వేలికి తొడిగి వెండి గిలగిచ్చకాయను చేతిలో పెట్టింది భవాని.

అంతా కుర్చీలు, బల్లలూ ఏర్పాటుచేశారేమో మహా సదుపాయంగా, అధునాతనంగా, శుభ్రంగా, సుందరంగా వుంది అక్కడి వాతావరణమంతా. కమ్మని వంటకాలు వడ్డించారు. అభిరుచి, అలవాటు ఉన్న వాళ్ళు 'తడి' పార్టీలో కూడా పాల్గొనేందుకు ఏర్పాటు చేశారు ఓ మూలగా.

శాస్త్రి ఎంత అధునాతనంగా ఉండే మనిషి అయినప్పటికీ 'తడి' పార్టీలంటే ఇష్టపడడు. ఎలాగో ఒకలాగ తప్పించుకుంటాడు. కాని ఆవాళ మాత్రం నలుగురు స్నేహితులు లాక్కుపోయి బలవంతంగా నోట్లో పోసినంత పని చేసి కాస్త తాగించేసేరు. అక్కడే కక్కుకున్నంత పనీ అయింది. కళ్ళు తిరిగి కిందపడ్డాడు. అంతా కంగారుపడిపోయి అప్పటికప్పుడు అతనికి పడుకోవడానికి ఏర్పాటుచేసి డాక్టరుకు కబురు పెట్టారు. డాక్టరు వచ్చి, నవ్వి "మరేం భయం లేదు. ఇంటికి పంపించివేయండి. తెల్లవారేసరికి కులాసాగా ఉంటారు. అలవాటు లేదుకదూ పాపం!" అన్నాడు. భవానీ బిక్కముఖం వేసుకుని పక్కనే కూర్చుని వుంది.

పార్టీ కోలాహలం ముగిసింది. అర్ధరాత్రి అవుతుంది. శాస్త్రి నెమ్మదిగా కళ్ళు తెరిచి చూశాడు. గుడ్ల నీళ్ళు కక్కుకుంటూ, భవాని కనిపించింది ముందుగా. ఆ వెనుకగా తన కొలీగూ, అతని భార్య, చుట్టాలూ అంతా తన దగ్గరే కూర్చున్నట్టు తోచి సిగ్గుపడి, లేచి కూర్చోబోయేడు. గమ్మున భవాని వచ్చిపట్టుకుంది. "లేవకండి! కొంచెం సేపుంటే కులాసాగా వుండొచ్చు. వెళ్ళిపోదాం" అంది. "తెల్లవారేక వెళ్ళొచ్చు" అన్నారు అక్కడున్న వాళ్ళు.

"అబ్బే మా ఇల్లు దగ్గరే! అయిదు నిముషాల్లో వెళ్ళిపోవచ్చు" అంది భవాని.

చన్నీళ్ళతో ముఖం కదుకున్నాడు శాస్త్రి. కొంచెం కులాసాగా ఉన్నట్లనిపించింది. లేచి వాళ్ళందరి దగ్గరా సెలవు తీసుకున్నాడు.

భవాని భర్త పక్కనే కూర్చుని అనుక్షణం జాగ్రత్తగా చూసుకుంటూంది. టాంక్ బండ్ మీద చల్లని గాలికి శాస్త్రి మరికొంచెం తేరుకున్నాడు. హుషారుగా ఈల వేసి పక్కనే కూర్చుని తననే దీక్షగా చూస్తున్న భార్య వంక చూచి నవ్వాడు.

భవాని ముఖం చిన్నబోయి వుంది. తను గట్టిగా నిలబడలేకపోయినందుకు బాధపడ్డాడు. తనవల్లనే కదా పార్టీలో, పేరంటంలో ఆమె సరదాగా గడపలేకపోయింది అనుకున్నాడు. అంతలో వెనుకగా సైడ్ ఇమ్మన్నట్టుగా ఒకటే రొదగా అదేపనిగా హారన్ వినిపించింది. సైడ్ ఇచ్చాడు. దూసుకుపోయింది టాక్సీ. కొంతదూరం వెళ్ళి ఆగిపోయి, వీళ్ళకోసమే ఎదురుచూస్తూన్నట్లు అందులో వున్న మనుషుల వాలకాలు స్పష్టంగా కనిపించాయి. భవానీకి అనుమానం వచ్చింది. తాను చూస్తే ఖరీదైన దుస్తులతో, వంటినిండా నగలతో వుంది. భర్త చూస్తే జబ్బు స్థితిలో ఎలాగో వున్నాడు. శాస్త్రి మాత్రం మామూలుగా కారు నడుపుతూనే వున్నాడు. అతి సామాన్యంగా వాళ్ళను దాటేడు.

మళ్ళీ వాళ్ళ టాక్సీ బయలుదేరింది. శాస్త్రికి కూడా అనుమానం వచ్చి కారు స్పీడు పెంచేడు. వెంకటేశ్వర స్వామి దేవాలయం ఇంక పది గజాలుందనగా టాక్సీ వచ్చి వాళ్ళ కారు పక్కనే ఆగింది. "కారాపు" అంటూ కేకలు వినిపించాయి.కారు నెమ్మదిగాపక్కనే నడుస్తూనే వుంది. రోడ్డు చూస్తే నిర్మానుష్యంగా వుంది. భవానీకి

గాని, శాస్త్రికి గాని ఏం చెయ్యాలో తోచలేదు.

క్షణంలో కారులోంచి తళతళలాడే కత్తులు నాలుగు దర్శనం ఇచ్చాయి. భవానీకి అంతాఅర్థం అయిపోయింది. పరిస్థితిని వాకచక్యంగా ఎదుర్కోవాలి. ఎలా?

గత్యంతరం లేక శాస్త్రి కారు ఆపేడు. టాక్సీ కూడా ఆగింది పక్కగా. భవానీ ఉన్నవైపు ఇద్దరూ, శాస్త్రి ఉన్న వైపు ఇద్దరూ వచ్చి నిలబడ్డారు.

"అమ్మలూ! వంటిమీద ఉన్నవన్నీ ఏం మాట్లాడకుండా ఇచ్చేస్తావా? ప్రాణాలు ఇచ్చేస్తావా? ఎన్నాళ్ళనుంచో పాపం మా యావిడ ఇలాంటి చీరకోసం ఏడ్చేస్తుంది. పనిలో పని చీర కూడా ఇచ్చెయ్యి" అంటూ భవానిని చెయ్యి పట్టుకుని లాగబోయాడు. శాస్త్రిని గట్టిగా పట్టుకున్నారు. ఇవతలకు ఈడ్చేరు. భవాని కేకలు పెట్టసాగింది. హారన్ నొక్కి పట్టుకుంది. "వెంకటేశ్వర స్వామీ! నీ గుడిముందే ఇంత దారుణమా? తండ్రీ! ఎలా కాపాడతావో?" అంటూ ఆశ్చర్యపోయింది. చేతనైనంత వరకూ ఆత్మరక్షణ చేసుకోవాలి కదా? ఇద్దరు వెధవల్నీ విదిలించి కొట్టింది.

పుల్లిస్తరాకుల్లో మిగిలిన తిను బండారాలూ, అన్నం పోగుచేసి అమ్మే ఫోటో కాంట్రాక్టరు వెంకాయికి ఏదో గొడవ జరుగుతూన్నట్టు అనుమానం వచ్చి కళ్ళు విప్పి చూసేడు. కొంచెం దూరంలో రెండు కార్లూ—ధగధగా మెరిసిపోతూన్న ఓ ఆడకూతురు.

"ఏందబ్బా కత?" అనుకుని నెమ్మదిగా లేచి కూర్చుని అంతా, అన్నిపక్కలా చూశాడు. భవాని ప్రాణాలకు తెగించి వాళ్ళతో దెబ్బలాడుతుంది. శాస్త్రికి ఎన్ని దెబ్బలు తగిలేయో అంతులేదు.

వెంకాయి ఒక్కడే ఒక్క ఈల వేశాడు. ఆ ఈలకు బదులుగా ఎన్నో ఈలలు వినిపించాయి. నల్లగా అలుకు గుడ్డల్లా ఉన్న దరిద్రపుగుడ్డల ముసుగులన్నీ ఒక్కసారే లేచేయి. పాపం! వాళ్ళు ముష్టివాళ్ళు! వాళ్ళ దగ్గర ఆయుధాలు ఏమి వుంటాయి? ఎందుకు ఉంటాయి? ఉండవలసిన అవసరం మాత్రం ఏమి వుంది? కుంటివాడికి ఊత కర్ర వుంది. కాళ్ళు లేనివాడికి పీటచెక్క చక్రాల బండి వుంది. ఇంకా బీదవాడికి పాచిపోయిన పప్పుచారుతో సీనారేకు డబ్బా వుంది. ఆడవాళ్ళ దగ్గర జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లాకనిపించే భయంకరమైన ఆకారాలు వున్నాయి. వీటితో యుద్ధానికి బయలు దేరారు.

దండులా వచ్చి పడ్డారు. వాళ్ళ రాక్షస బలం ముందు నాలుగు కత్తులు ఏ మూలకు వస్తాయి? నించోలేని వాళ్ళు దుండగుల కాళ్ళమీద కొట్టారు. నించోగలిగినవాళ్ళు కర్రలతో బాదేరు. ఆడవాళ్ళంతా కూరలూ, పచ్చళ్ళూ, కారాలూ అన్నీ వాళ్ళ నెత్తిమీద మొత్తి, దిమ్మరించారు. భవానిని గుర్తించగానే వాళ్ళకి ఇంకా ఉత్సాహం వచ్చేసింది. ఎలాగో వాళ్ళచేతుల్లో కత్తుల్ని ఊడలాక్కున్నారు.

"మన తల్లికి కష్టం వచ్చింది. రండర్రో! రండర్రో" అంటూ ఒకటే కేకలు!

కళ్ళు మండిపోతూ వుంటే, ఒళ్ళు చిరాకెత్తిపోతూ వుంటే, కత్తులు కాస్తా ఎవళ్ళో లాగేసుకుంటే దుండగులు ఎలాగో టాక్సీ దగ్గరకు పరుగుపెట్టడం మొదలు పెట్టారు. గుంపుకూడా టాక్సీ దగ్గరకు పరుగెత్తింది. దానిని కదలనీయకుండా చేసేసి, చొట్టలుపడేటట్టు కొట్టారు. వాళ్ళకోపం వాళ్ళేం చేస్తున్నారో తెలియనంతగా మండిపోయింది. ఎలాగో గుంపును తప్పించుకుని టాక్సీ పలాయనం చిత్తగించింది.

> ## రేయి — పగలు
>
> రాత్రి నిద్రలో నీవు
> జాబిల్లివై కనిపిస్తే
> రంగు రంగుల కలలు
> కలువలై వికసిస్తాయి
> పగలు మెలకువలో నీవు
> రవిబింబమై ఉదయిస్తే
> వెలుగూ వేడిమీ
> బతుకులో పరమకుంటాయి.
> రేయి మౌనంగా గడుస్తుంది
> పగలు నిర్మాణంగా నడుస్తుంది.
>
> — వేముగంటి

కారు దగ్గరే నిలబడి, ఈ రక్షక సైన్యం ఎక్కడ నుంచి వచ్చింది? ఎవరు పంపించారు? అని ఆశ్చర్య పోతున్నాడు శాస్త్రి. భవానీ నెమ్మదిగా తేరుకుని భర్త తలమీదా, వంటి మీదా పడ్డ అన్నం మెతుకుల్నీ, పప్పు బద్దల్నీ పమిట కొంగుతో శుభ్రం చేయసాగింది. భవానీ పరిస్థితి సరేసరి. చీర అంతా రకరకాల పులుసులూ, పచ్చళ్ళు చింది కొత్తరకం ప్రింటులా కనిపిస్తూంది. వాళ్ళ కత్తి మొనలవల్ల తగిలిన గాయాలు సరేసరి.

అంతలో రక్షకసైన్యం గుంపంతా వీళ్ళని పరామర్శించడానికి వచ్చింది. "ఏం చేశారు తల్లీ? అన్నపూర్ణ తల్లీ! దుర్మార్గులేం చేశారమ్మా?" అని అడిగారు. భవానీ చిరునవ్వు నవ్వి "లేదు లేదు. మీరుండగా వాళ్ళేంకేం చేయగలరు? హారన్ కొట్టి మీ నిద్ర పాడుచేశాను కదూ? ఇక మీరు నిశ్చింతగా నిద్రపొండి. మా ఇల్లు ఇక్కడే. ఎంతో దూరం లేదు. వాళ్ళకా సంగతి తెలియక ఇక్కడ జనం లేరుకదా అని కారు ఆపేసేరు. మీ ఋణం ఎలా తీరుతుందయ్యా?" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది భవాని.

"అమ్మా! నువ్వూ, అయ్యా సుఖంగాఉన్నారు. అదే చాలు తల్లీ! త్వరత్వరగా అయ్యను డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళు. వళ్ళంతా రక్తం!" అంటూ తొందర పెట్టేరు. భవానీ భర్తను కారెక్కించి జాగ్రత్తగా ఇంటికి చేర్చింది. డాక్టరుకి ఫోను చేసింది. అసలే నిస్సత్తువగా వున్న శాస్త్రి అనుకోని పోరాటంతో మరింత నిస్సత్తువగా అయిపోయాడు.

గాయాలు మాని, ఆ అర్ధరాత్రి సంఘటన వల్ల కలిగిన కలవరం నుంచి ముందుగా కోలుకున్నది భవానియే! ఆఫీసుకు సెలవు పెట్టుకుని ఇంట్లో కూర్చోవడంతో ఏం తోచక ఒక పక్కా, వంటి నిండా అప్పటప్పుడే తగ్గుముఖం పట్టిన దెబ్బల నొప్పి ఒకపక్కా, ఆనాడు తమ ఇద్దరినీ రక్షించిన మహాశక్తి ఏమిటి అనే మీమాంస ఒక పక్కా వేధిస్తుంటే, ఎప్పుడు చూసినా ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూన్నట్టు కనిపించేవాడు శాస్త్రి. భవాని మాత్రం శాస్త్ర ప్రకారంగా తాను నమ్మిన దేవుడే వాళ్ళ రూపంలో వచ్చి కాపాడాడనీ, తన పుణ్యాలే అలా ఆనాడు రక్షించాయనీ అనుకుంది. ఆమెకదేమీ చిత్రంగా తోచలేదు. దేవుడు వున్నది దీనుల్నీ, నమ్మిన వారినీ కాపాడడానికే కదా? అనుకుంది మామూలుగా.

కాని, శాస్త్రి మనసు మాత్రం ఎటూ, ఏదీ అర్థం కాక అల్లాడిపోయింది. వాళ్ళెప్పుడు తమను వెంబడించడం మొదలుపెట్టేరు? సరిగ్గా ఆ గుడి దగ్గర కనుక సరిపోయింది. వేరేచోట అయితే, తానూ భవానీ ఏమయి పోయేవారు. సోదిలోకి రాకుండా పోదురా? లేకపోతే భవానీ నమ్మే శ్రీ వెంకటేశ్వరస్వామి మరే రూపంలోనైనా వచ్చేవాడేమో? సరిగ్గా ఆ గుడి దగ్గరే జరిగితే మాత్రం ఆ ముష్టివాళ్ళు అంత తమాషాగా దుండగుల్ని ఎదిరించడమా? తమ ఇద్దరినీ రక్షించడమా? భవానీ ప్రతీ శనివారం చేసే పుణ్యానికి ప్రతిఫలం ఇంత గొప్పగా వుంటుందా? ఏదో కాసిన్ని డబ్బులు వాళ్ళ మొహాన పడేస్తే ఇంతలో నా ఐశ్వర్యం తరిగిపోతుందా? ఎందుకు భవాని మనస్సు కష్టపెట్టాలి? అని తనను తాను నిగ్రహించుకుని తాను కూడా పుణ్యం చేశాడు కాబోలు! సాటి వ్యక్తిని గౌరవించడంలో, నిస్సహాయుల్ని ఆదుకోవడంలో ఇంత పుణ్యం వుంది కాబోలు! భవానీని గుర్తుపట్టగానే ఆ బిచ్చగాళ్ళు చూపించిన ఉత్సాహాన్ని తానే మాటలతో వర్ణించగలడు? వాళ్ళు ఆమె పట్ల ఎంత బాధ్యత చూపించుకున్నారు?

"ఏమిటాలోచిస్తున్నారు? ఈ మధ్య తెగ ఆలోచిస్తున్నారు దేనిని గురించి? నాతో చెప్పవచ్చా" అంది భవానీ.

దీర్ఘమైన కఠిన తపస్సు అనంతరం దేవత ప్రత్యక్షమైతే భక్తుడు ఎలా కింకర్తవ్యతా విమూఢుడై పోతాడో, అలా విభ్రాంతితో కొత్తగా చూశాడు శాస్త్రి భార్య వైపు. అతని కళ్ళలో ఏ భావమూ చదవలేకపోయింది భవానీ

మరునాడు పొద్దున్నే వెంకటేశ్వరస్వామి ఆలయం దగ్గర పెద్ద కోలాహలం. ఎవరో ఒక శ్రీమంతుడు భార్యతో సహా వచ్చి గుడి దగ్గర బిక్షగాళ్ళందరికీ చీరలూ, పంచెలూ, దుప్పట్లూ, డబ్బులూ దానం చేసేడట! ఒకసారికి రెండుసార్లు తీసుకున్న వాళ్ళున్నారట కాని, ఏ రకం దానమూ పొందకుండా వెళ్ళిపోయిన వాళ్ళు ఒకళ్ళూ కూడా లేరట! అటువంటి దానంఖేవల ఎవ్వరూ చేయనేలేదట!

●